## స్వామి వారిని దర్శించుకున్న జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



స్వామి వారిని దర్శించుకుంటున్న జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

కొమురవెల్లి, డిసెంబర్ 15, ప్రభాతవార్త : మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామిని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ శుక్రవారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా అలయ అధికారులు, అర్చకులు జిల్లా అదనపు కలెక్టర్‌కు ఘన స్వాగతం పలికారు. స్వామి వారి దర్శన అనంతరం తీర్థ ప్రసాదాలను అందించారు. అమె వెంట అలయ అధికారులు ఉన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

## రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు బస్వాపూర్ విద్యార్థి

పుల్కల్, డిసెంబరు 15, ప్రభాతవార్త: ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి బాలుర వాలీబాల్ అండర్ 14 విభాగంలో జరిగే పోటీలకు మండలంలోని బస్వాపూర్ ఆదర్శ పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి హప్సిభా, పిడి రాజులు తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి వాలీబాల్‌లో అర్హులను ఎంపిక చేసేందుకు జిల్లా కేంద్రమైన సిద్దపేటలో ఎంపిక ప్రక్రీయ నిర్వహించారు. ఎంపికలో బస్వాపూర్ ఆదర్శ పాఠశాలలో 8వ తరగతిలో విద్యను ఆర్జిస్తున్న జి నందును ఎంపిక చేశారన్నారు. నారాయణపేటలో 3 రోజుల పాటు సాగే రాష్ట్ర స్థాయిలో వాలీబాల్ పోటీలలో నందు పాల్గొని పోటీల్లో తలపడతాడన్నారు. రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన నందును ప్రిన్సిపాల్, పిడి, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు.

# విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలి

**-పెండింగ్ కేసులపై నెల వారి సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని**


పెండింగ్ కేసులపై నెల వారి సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

మెదక్ అర్బన్, డిసెంబర్15 ప్రభాతవార్త: ప్రతి పోలీసు అధికారి తన విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి ఉండాలని, న్యాయస్థానాల్లో కేసుల్లో ఉన్న నిందితులకు తప్పకుండా శిక్షలు పడేందుకు కృషి చేయాలని, తద్వారా ప్రజలకు పోలీసు వ్యవస్థపై మరింత నమ్మకం పెరుగుతుందని జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా సిబ్బందితో నెల వారి నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్ ఉన్న కేసుల్లో గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని మాట్లాడుతూ గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసుల్లో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ఏ విధంగా ఇన్వెస్టిగేషన్ చేయాలి, ఏయే అంశాలు క్రోడీకరించాలి తదితర అంశాల గురించి వివరించారు. ప్రజలకు రోడ్డు భద్రతా నియమాల గురించి అవగాహన కలిగించాలని, నియమాలు పాటించని వారిపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి అధికారికి పూర్తి స్టేషన్ మేనేజ్‌మెంట్ తెలిసి ఉండాలని సూచించారు. కేసుల చేధనలో అత్యాధునికి టెక్నాలజీ ఉపయోగించి, కేసును చేధించడానికి సంబంధించిన ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్స్ త్వరితగతిన సేకరించుకోవాలని, కోర్టు డ్యూటీ ఆఫీసర్ విధులు నిర్వహించే అధికారులకు, సిబ్బందికి తరచుగా శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. సీసీ కెమెరాలు ఉంటే గ్రామానికి రక్ష అని, ప్రజలకు సెక్యూరిటీగా పని చేస్తాయని, అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, తూప్రాన్ డీఎస్పీ యాదగిరి రెడ్డి, ఎస్బీ సీఐ దిలీప్‌కుమార్, డీసీఆర్బీ సీఐ ప్రకాష్‌గౌడ్, జిల్లా సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన

**-పథకాలు అర్హులకు అందేలా తెలియజేయడానికే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర**


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా ఇంచార్జి

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన పెంపొందించడం, పథకాలు అర్హులకు అందేలా తెలియజేయడానికి రూపొందించిన కార్యక్రమమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర అని కేంద్ర, టెక్స్టైల్ మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా ఇంచార్జి ప్రభారీ అజయ్‌గుప్తా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఈనెల 15వ తేదీ నుంచి వచ్చే నెల జనవరి 26 వరకు జిల్లాలో చేపట్టనున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో అయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేదల కోసం దేశ వ్యాప్తంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించకపోవడంతో అర్హులకు చేరడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం గొప్ప లక్ష్యంతో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ప్రారంభించిందని లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. రెండో దఫా పర్యటనలో క్షేత్ర స్థాయిలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాలను, పథకాల అమలును పరిశీలిస్తానని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ మాట్లాడుతూ వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల ప్రచార వాహనాలను జిల్లాఒని గ్రామ గ్రామాన, మున్సిపాలిటీల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ తెలియజేసేలా 40 రోజుల పాటు ప్రచార వాహనాలు క్షేత్రస్థాయిలో పర్యటించేలా షెడ్యూల్ రూపొందించామని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి వివరించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డిఆర్‌డిఓ జయదేవ్ అర్యా, ఎల్‌డిఎం సత్యజిత్, జిల్లా అధి కారులు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలు సమూలంగా నిర్మూలించాలి : సీపీ శ్వేత



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్వేత

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి : గంజాయి, డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలు సమూలంగా నిర్మూలించడంతో పాటు అమ్మే వారిపై నిఘా పెట్టి కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని సీపీ శ్వేత పోలీసు అధికారులను అదేశించారు. సీపీ కార్యాలయంలో శుక్రవారం అమె జిల్లా పోలీసు అధికారులతో పెండింగ్ కేసులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా నమోదైన కేసులను త్వరగా పరిశోధన చేసి డిస్పోజల్ చేయాలన్నారు. కోర్టులో పెండింగ్ గ్రేవ్ ట్రయల్ కేసులు, ఐటీ యాక్ట్ కేసులు డిస్పోజల్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దేశ, రాష్ట్ర స్థాయిలో మంచి ర్యాంకింగ్ కోసం పోటీ పడాలన్నారు. ప్రతి నెల 15 నుంచి 20 లోపు ఇన్వెస్టిగేషన్ చేసిన కేసులలో కోర్టులో చార్జిషిట్ దాఖలు చేయాలన్నారు. టార్గెట్ పెట్టుకొని పెండింగ్ కేసులను తగ్గించాలన్నారు. సైబర్ నేరాల నియంత్రణ, గంజాయి, డ్రగ్స్ నిర్మూలన కోసం గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో పోలీసు అధికారులు అందె శ్రీనివాస్‌రావు, సతీష్, రమేష్, సురేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, శ్రీనివాస్, రఘుపతిరెడ్డి, గురుస్వామి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## జిల్లాలో విక్‌సింగ్ భారత్ యాత్రను విజయవంతం చేయాలి

**-కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ డైరెక్టర్ పౌసుమి బసు**



విక్ సిత్ భారత్ సంకల్ప్ యాత్రపై సమీక్షిస్తున్న కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ డైరెక్టర్ పౌసుమి బసు

సంగారెడ్డి మున్సిపాలిటి, డిసెంబరు 15, ప్రభాతవార్త: జిల్లాలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ డైరెక్టర్ పౌసుమి బసు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ జిల్లా అధికారులతో జిల్లా కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌసుమి బసు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఫ్లాగ్ షిప్ పథకాలైన ఆయుష్మాన్ భారత్, పిఎం జెఏవై సిఎం గరీబ్ కళ్యాణ్ అన్నా యోజన, పీఎం ఉజ్వల యోజన, పిఎం విశ్వకర్మ, పిఎం కిసాన్ సమ్మాన్ నిధి, కిసాన్ క్రెడిట్ కార్డ్, పీఎం పోషన్ అభియాన్, హర్ ఘర్ జల్-జల్ జీవన్ మిషన్, సర్వే ఆఫ్ విలేజర్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రూవైస్డ్ టెక్నాలజీ ఇన్ విలేజస్ ఏరియాస్, జన్‌దన్ యోజన, జీవన్ జ్యోతి భీమా యోజన, సురక్ష భీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, పిఎం ప్రనామ్, నానో ఫర్టిలైజర్ పథకాలకు సంబంధించిన గ్రామీణ ప్రాంతాల ప్రజలందరికి అవగాహన కల్పించడంతో పాటు, అర్హులు పథకాల కోసం నమోదు చేసుకునేలా ప్రోత్సాహించాలన్నారు. ఈ నెల 16వ నుంచి జనవని 25వ తేదీ వరకు ప్రతి రోజు ఒక్కోవాహనం రెండు పంచాయితీలకు వెల్లేలా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం 17 పథకాల గుర్తించి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ శరత్ మాట్లాడుతూ జిల్లాకు 10 మొబైల్ వాహనాలు వచ్చాయని, షెడ్యూల్ మేరకు ప్రతి వాహనం ప్రతి రోజు రెండు పంచాయితీలను కవర్ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా పథకాలకు సంబంధించి ఆయా శాఖల అధికారులు ముందస్తు ప్రణాళికతో తమ బాధ్యతలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డిఆర్ఓ నగేష్, ఎల్‌డిఎం గోపాల్‌రడ్డి, డిఎంహెచ్ఓ గాయత్రి దేవి, డిఆర్‌డిఓ శ్రీనివాస్ రావు, డిఎస్ఓ వనజాత, డిపిఓ సురేష్ మోహన్, జడ్పీ సిఈఓ ఎల్లయ్య, డిఈఓ వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖజెడి నరసింహరావు, ఉద్యాన శాఖ డిడి వెంకటేశ్వర్లు, పశుసంవర్ధక శాఖ,ఫిషరీస్, డిడబ్ల్యుఓ,బిసి,ఎస్సీ,కార్పోరేషన్ తదితర శాఖల జిల్లా అధికారులు, డివిజనల్ పంచాయితీ అధికారులు, ఎంపిఓలు పాల్గొన్నారు.

# పంచాయతీకి పంగ నామం పెడుతున్న చార్మినార్ బెవారిస్

**-అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు**
**-పట్టించుకోని అధికారులు**
**-వ్యర్థ జలాలతో నీటి కాలుష్యం**
**-మృత్యువాత పడుతున్న మూగజీవాలు**


శివంపేటలోని చార్మినార్ బేవారిస్



శివంపేట గ్రామ పంచాయతీ కార్యాలయం

చౌటకూరు, డిసెంబరు 15, ప్రభాతవార్త: ప్రభుత్వానికి (గ్రామ పంచాయితీకి) చెల్లించాల్సిన పనులను ఎగనామ పెడుతూ అక్రమంగా నిర్మాణాలు చేపడుతూ చార్మినార్ బేవారిస్ యాజమాన్యం పంచాయితీకి పంగనామ పెట్టడంతో పాటు రైతులకు ఇబ్బందులకు గురి చేస్తూ వస్తోంది. ఏండ్ల తరబడి ప్రభుత్వ ఆదాయాన్ని కాజేస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారని చెప్పావచ్చు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే... మంలంలోని శివంపేట గ్రామంలోని చార్మినార్ బేవారిస్ యాజమాన్యం తన ఇష్టారీతిగా వ్యవహరిస్తూ అందరికి అవస్థలకు గురిచేస్తోంది. అక్రమ నిర్మాణాలు, వ్యర్థ జాలాలను మంజీరాలోకి వదిలేయడం, పంచాయితీకి చెల్లించాల్సిన పన్నులు ఎగొట్టడం చేస్తున్నా సంబంధిత అధికారులకు పట్టి పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థ జలాలను పక్కనే ఉన్న మంజీర లోకి వదిలేస్తుండటంతో నీరు కలుషితం అవుతున్నాయి. కలుషితం అయితన నీటి గుండా వెళ్లే మూగజీవాలు రోగాల బారిన పడుతుండటంతో రైతులు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. కర్మాగారం పంచాయితీకి ఏడాదికి 1 కోటికి పైగా పన్నులు చెల్లించాల్సి ఉండగా కేవలం 30 లక్షల లోపే పన్నులు చెల్లిస్తూ పంచాయితీకి పంగనామం పెడుతున్నదనడంతో అతిశయోక్తి కాదని చెప్పవచ్చు. అక్రమాలకు పాల్పడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ రైతులకు అవస్థలు పాలు చేస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలన్సిన అధికారులు పట్టించుకోకపోవడం విస్మయాన్ని కల్గిస్తోంది.

**-కోర్టును ఆశ్రయించిన గ్రామస్థులు...**

పంచాయితీకి నష్టం కల్గిస్తూ రైతులకు ఇబ్బందులకు గురి చేస్తున్న చార్మినార్ బెవారిస్‌పై గ్రామానికి చెందిన కే మల్లికార్జున్‌తో పాటు మర ముగ్గురు 2010లో ప్రజా ప్రయోజనాల ధరఖాస్తులు దాఖలు చేయగా హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక హర జే అనిల్ కుమార్ విచారణ చేపట్టారు. పంచాయితీ అనుమతులు లేకుండానే అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నట్లు, మంజీరా జాలాలను అక్రమంగా వినియోగించుకోవడంతో పాటు మంజీరాకి వ్యర్థ జలాలను వదులుతున్నట్లు న్యాయవాది వాదించడంతో సమగ్ర నివేదిక అందించాలని జిల్లా పంచాయితీ, గ్రామ పంచాయితీ అధికారులకు కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అంతకు ముందే 2008లో పంచాయితీ కార్యాలయం నుంచి పరిశ్రమకు నోటీసులు జారీ చేసినా యాజమాన్యం పట్టనట్లుగా వ్యవహరించి అక్రమ నిర్మాణాలను యదేశ్చగా కొనసాగిస్తూ వచ్చింది. 2009 ఫిబ్రవరిలో మరో మారు పంచాయితీ నోటీసులు పంపించిన ప్రయోజనం లేకుండా పోయింది.

**-28న కోర్టుకు హాజరుకావాలని కోర్టు ఆదేశం...**

ఈ నెల 28వ తారీఖున కోర్టు వాయిదా ఉండటంతో పరిశ్రమ యాజమాన్యం, గ్రామ పంచాయితీ కార్యదర్శులు ప్రత్యక్షంగా హాజరుకావాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

**-భారీగా పన్ను ఎగవేత-గ్రామ ఉప సర్పంచ్ నత్తి దశరత్...**

2008కి ముందు పరిశ్రమ యాజమాన్యం గ్రామ పంచాయితీకి పన్ను చెల్లించేంది కాదని, గ్రామస్థులు పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేయడంతో 1 కోటి 50లక్షల రూపాయలు చెల్లించాల్సి ఉండగా కేవలం 30లక్షల రూపాయలను పన్ను రూపేణ చెల్లించి చేతులు దులిపేసుకుందని గ్రామ ఉప సర్పంచ్ నత్త దశరథ్ ఆరోపించారు. అధికారులు తమ చేతులు తడుపుకున్నందునే పంచాయితీకి పన్నుల రూపంలో రావాల్సిన లక్షల రూపాయలను పరిశ్రమ ఎగొట్టిందని దుయ్యబట్టారు. ఈ విషయాన్ని ప్రభాతవార్త డిపిఓ సతీష్ మోహన్ దృష్టికి తీసుకుపోగా రెండు రోజుల్లో పూర్తి సమాచారాన్ని సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందచేస్తామని డిపిఓ సతీస్ మోహన్ పేర్కొన్నారు.

## మితిమీరిన అహంకారంతోనే కెసిఆర్ సిఎం కాలేకపోయారు

**-గెలుపోటములు ముఖ్యం కాదు**
**-ప్రజలతో సత్సంబంధాలు ఉండాలి**
**-బిజెపి ప్రచార కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్**


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

గజ్వేల్, డిసెంబర్ 15 (ప్రభాతవార్త): ఏ ఎన్నికల్లో అయినా గెలుపోటములు సహజమని, గెలిచినా ఓడినా ప్రజలతో సత్సంబంధాలు కలిగిన వ్యక్తినని మాజీ మంత్రి, బిజెపి ప్రచార కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలోని ప్రజ్ఞా గార్డెన్‌లో బిజెపి కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో 2014 నుండి బిజెపి నెమ్మదిగా ఎన్నికల్లో ఒక్కో నియోజకవర్గంలో గెలుచుకుంటూ వచ్చిందని, ఇప్పటికే అన్ని నియోజకవర్గాలలో పర్యటించిన ఆయన ప్రతి చోట తనకు ఎదురైన అనుభవాలను కార్యకర్తలతో పంచుకుంటున్నట్లు తెలిపారు. ప్రతిచోట రాష్ట్ర ఎన్నికలు, కేంద్రం ఎన్నికలు వేరనే ప్రజలు అనుకుంటున్నారని, పార్టీతో, వ్యక్తితో సంబంధం లేకుండా దేశభక్తి ఉన్న ఓటర్లు అందరూ ప్రధాని మోడినే మళ్ళీ ప్రధాని కావాలని అనుకుంటున్నారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తప్పకుండా బిజెపి విజయం సాధిస్తుందని, తెలంగాణ రాష్ట్రం నుండి అత్యధిక లోక్‌సభ సీట్లను సాధిస్తుందని పేర్కొన్నారు. బిజెపి తెలంగాణలో బలం పుంజుకుంటుందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశంతో పొత్తు పెట్టుకొని 12 స్థానాల్లో గెలిచిందన్నారు. కానీ ఇప్పుడు స్వతంత్రంగా బిజెపి ఎనిమిది స్థానాలు గెలుచుకోవడం, 19 నియోజకవర్గాల్లో నువ్వా నేనా అన్నట్లు పోటీలో రెండో స్థానంలో నిలిచిందన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు బిజెపిని చూసి భయపడుతున్నాయన్నారు. ప్రజాస్వామ్యమైన ఎన్నికలు జరిగి ఉంటే బిజెపి గెలిచేదన్నారు. మోడి ఎల్లప్పుడూ ప్రభుత్వం ఇచ్చే పథకాలు అనే మాట్లాడేవారని, కెసిఆర్ ప్రభుత్వ పథకాలకు తానే ఇస్తున్నట్లు బిల్డప్ ఇచ్చారని విమర్శించారు. కెసిఆర్ ఉంటేనే తెలంగాణ ఉంటుందన్న భావన ప్రజలలో పాతుకుపోయేలా చేశాడని మండిపడ్డారు. కానీ మితిమీరిన అహంకారమే కెసిఆర్‌ను దెబ్బకొట్టి పదవి నుండి తొలగించిందన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, బిజెపి నాయకులు పేర్ల శ్రీనివాస్, ఆకుల రాజయ్య, జశ్వంత్‌రెడ్డి, నలగామ శ్రీనివాస్, మాజీ జెడ్‌పిటిసి సింగం సత్తయ్య, చెట్టి సురేష్‌గౌడ్, నాయకులు మనోహర్‌యాదవ్, బండారు మహేష్, ఉప్పల మధుసూదన్, సందీప్‌కుమార్, సత్యనారాయణ, రొట్టెల దాసు, కుడిక్యాల రాములు, నాగు ముదిరాజ్, సల్ల శ్రీను, ఆంజనేయులు పాల్గొన్నారు.

**కుకునూరుపల్లి మండలంలో :** గజ్వేల్‌లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయినప్పటికి కార్యకర్తలకు అందుబాటులో ఉండి స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలువడానికి బిజెపి నాయకులకు, కార్యకర్తలకు తన వంతు సహకారం అందిస్తానని బిజెపి కార్యవర్గ సభ్యులు ఈటెల రాజేందర్ అన్నారు. శుక్రవారం కుకునూరుపల్లి మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు మన్నెం శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ పలకరింపు సభలో నిర్వహించారు.కార్యక్రమంలో నాయకులు గాడిపల్లి భాస్కర్, దారం గురువారెడ్డి, మాదాడి జశ్వంత్‌రెడ్డి, గడ్డమిది రామస్వామి, అరే భాస్కర్, బడెకోల్ నర్సింలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వేస్ట్ డీకంపోజర్‌తో అద్భుత ఫలితాలు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న దృశ్యం

నంగునూర్, డిసెంబర్ 15, ప్రభాతవార్త : భూమిలో పేరుకుపోయిన రసాయన అవశేషాలను కుళ్లబెట్టడంతో పాటు భూమిని సారవంతం చేయడంలో వేస్ట్‌డీకంపోజర్(డబ్ల్యూడీసీ) అద్భుతంగా పని చేస్తుందని ములుగు ప్రాంతీయ పట్టు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ వినోద్‌కుమార్, విశ్రాంత శాస్త్రవేత్త ప్రవీణ్‌కుమార్‌లు అన్నారు.వేస్ట్ డీకంపోజర్ ఉపయోగించిన పట్టు సాగు చేస్తున్న ముంద్రాయి రైతు రాగుల రాజు వ్యవసాయ క్షేత్రం వద్ద శుక్రవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పట్టుపురుగులకు నాణ్యమైన మల్బరీ అకులు మేతగా వేసినప్పుడే పంట దిగుబడి నాణ్యతతో వస్తుందన్నారు.భూమిలో రసాయన అవశేషాలు పేరుకొని ఉండటం వలన అందులోని మల్బరీ అకును పురుగులకు మేతగా వేయడం వలన పురుగులు వాంతి చేసుకోవడం, గూళ్ల సరిగా అల్లుకోకపోవడం, కొన్ని సార్లు పురుగు చనిపోవడం వంటి సమస్యలు రైతులకు ఎదురవుతాయని తెలిపారు. ఈ సమస్య నుంచి బయటపడానికి రైతులు వేస్ట్ డీకంపోజర్ ద్రావణాన్ని సాయిల్ అప్లికేషన్ చేసుకోవడం వలన రసాయన అవశేషాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. పట్టు సాగులో రసాయన ఎరువులు బదులు సేంద్రీయ ఎరువులు వాడుతూ సాగు చేపడితే అధిక లాభాలు వస్తాయన్నారు. అనంతరం వేస్ట్ డీకంపోజర్ తయారీ విధానంపై మల్బరీ అకును కోసే కట్టలు కట్టే యంత్రం పనితీరుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిహెచ్ఎస్ఓ సునీత, పట్టు పరిశ్రమ అధికారి ఇంద్రసేనారెడ్డి, ములుగు ప్రాంతీయ పరిశోధన కేంద్రం సాంకేతిక విభాగం అధికారులు రాఘవేందర్, తుయమణి, పట్టు పరిశ్రమ అధికారులు రేణుశర్మ, లింగం, మల్లయ్య, జిల్లా పట్టు రైతుల సహకార సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఐలయ్య, వెంకటరామిరెడ్డి, గౌరవాధ్యక్షులు నర్సింలు, రైతులు పాల్గొన్నారు.

## నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళి యాదవ్‌పై అవిశ్వాస తీర్మానం...


అవిశ్వాస తీర్మాణ కాపీని అదనపు కలెక్టర్‌కు అందిస్తున్న నర్సాపూర్ మున్సిల్ కౌన్సిలర్లు

నర్సాపూర్,నర్సాపూర్ రూరల్,డిసెంబర్ 15,ప్రభాతవార్త: నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళి యాదవ్‌పై అవిశ్వాస తీర్మాణం ప్రవేశపెట్టాలని కోరుతూ బిఆర్ఎస్ పార్టీకి చెందిన 9 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మాణం కాపీని శుక్రవారం మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు అందచేశారు. నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 15 వార్డులు ఉన్నాయి. అయితే మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ తరుపున తొమ్మిది మంది కౌన్సిలర్లు గెలుపొందగా బిజెపి పార్టీకి చెందిన 4గురు కౌన్సిలర్లు స్వతంత్ర అభ్యర్థులు ఇద్దరూ గెలుపొందారు. స్వతంత్ర అభ్యర్దులు ఇద్దరూ గెలుపొందారు. స్వతంత్ర అభ్యర్థులు ఇద్దరు బిఆర్ఎస్ పార్టీలో అప్పట్లో చేరారు. అయితే బిఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్ల సంఖ్య 11 కు చేరింది. దీంతో బిఆర్ఎస్ పార్టీ నుండి మురళీధర్ యాదవ్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. కాగా గత రెండు సంవత్సరాల క్రితం మురళీధర్ యాదవ్ బిఆర్ఎస్ పార్టీకి చెందిన మరో ఇద్దరు బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి మరో ఇద్దరు బిఆంఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లను తీసుకొని బిజెపి పార్టీలో చేరారు. అయితే ఈ మద్య జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి పార్టీకి చెందిన కౌన్సిలర్ సునీతా, బాల్‌రెడ్డి బిజెపి పార్టీకి రాజీనామ చేసి బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ప్రస్తుతం బిఆర్ఎస్ పార్టీకి చెందిన 9 మంది కౌన్సిలర్ ఉండగా బిజెపి పార్టీకి చెందిన 6 మంది కౌన్సిలర్లు ఉన్నారు. అయితే బిఆర్ఎస్ పార్టీకి చెందిన 9 మంది కౌన్సిలర్లు మున్సిపాలిటీ చైర్మన్ మురళీధర్ యాదవ్‌పై అవిశ్వాసం తీర్మాణం ప్రవేశపెట్టాలని అదనపు కలెక్టర్ కు అవిశ్వాస తీర్మాణ కాపీని అందచేశారు. నర్సాపూర్ మున్సిపాలిటీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మాణం ప్రవేశపెట్టడంతో నర్సాపూర్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈ అవిశ్వాస తీర్మాణంలో ఎవరు నెగ్గుతారనేది త్వరలో వేచి చూడాలి. అవిశ్వాస తీర్మాణ కాపీని అందచేసిన బిఆర్ఎస్ కౌన్సిలర్లు మున్సిపల్ వైస్ చైర్మన్ నహిముద్దీన్, కౌన్సిలర్లు అశోక్ గౌడ్, సునీత బాల్‌రెడ్డి, లక్ష్మీ నగేష్, ఇస్రాత్ సిద్దికి, గొల్ల రుక్కమ్మ, పంబల్ల లలిత బిక్షపతి, సరిత, ఆంజనేయులు, రామచందర్‌లు ఉన్నారు.

## ఓటరు నమోదుపై బీఎల్‌వోలకు అవగాహన సదస్సు

**-నర్సాపూర్ ఆర్డీవో శ్రీనివాసులు**



ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

**కొల్చారం, డిసెంబర్15 ప్రభాతవార్త:**
ఓటరు నమోదు ప్రక్రియ పకడ్బందీగా చేయాలని నర్సాపూర్ ఆర్డీవో శ్రీనివాసులు, కొల్చారం తహశీల్దార్ గఫార్ మియాలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కొల్చారం గ్రామంలోని రైతు వేదికలో బీఎల్‌వోలకు ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీవో శ్రీనివాసులు ముఖనయ అతిథిగా హాజరై ఓటరు నమోదు, సవరణలపై బీఎల్‌వోలకు అవగాహన కల్పించారు. ఫారం-6, ఫారం-7, ఫారం-8ల గరించి వివరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ప్రభాకర్, బీఎల్‌వోలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బీమా రంగంలో అపారమైన ఉపాధి అవకాశాలు

**-ఎల్ఐసీ మేనేజర్ నాగురి ప్రేమ**



సర్టిఫికెట్ కోర్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**మెదక్ అర్బన్, డిసెంబర్15 ప్రభాతవార్త:**
భీమా రంగంలో అపారమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని ఎల్ఐసీ మేనేజర్ నాగురి ప్రేమ అన్నారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కెరుర్ ఆపర్చునిటీస్ ఇన్ ఇన్సూరెన్స్ సెక్టార్ అనే అంశంపై నిర్వహించిన కార్యక్రమానికి ఎల్ఐసీ సీనియర్ నేమేజర్ నాగురి ప్రేమ హాజరై మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అపారమైన అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులు వాటిని అందిపుచ్చుకొని ఉన్నత స్థితికి చేరాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.కె. హుస్సేన్ మాట్లాడుతూ భీమా, దాని అనుబంధ రంగాల్లో ఉన్న ఉపాధి అవకాశాలపై విద్యార్థులు దృష్టి సారించాలని పేర్కొన్నారు. వాణిజ్య శాస్త్ర విభాగం సంయుక్తంగా విద్యార్థులకు భీమా రంగంలో ఉపాధి అవకాశాలు అనే అంశంపై సర్టిఫికెట్ కోర్సును ఈ విద్యా సంవత్సరం నుండే ప్రారంభిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్టిఫికెట్ కోర్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ పూర్ణచందర్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ మెదక్ బ్రాంచ్ మేనేజర్ పూర్ణచందర్, అధ్యాపకులు, టీఎస్‌కేసీ సమన్వయ కర్త ప్రవీణ్‌కుమార్, డాక్టర్ సుధాకర్, శరత్‌రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్, హరిత, ఉగ్గి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలి

**-మండల బీజేపీ అధ్యక్షులు కోణం విఠల్**




విలేకరులతో మాట్లాడుతున్న మండల బీజేపీ అధ్యక్షులు కోణం విఠల్

**పెద్దశంకరంపేట, డిసెంబర్15 ప్రభాతవార్త:**
మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలిపి ఉద్యోగ నోటిఫికేషన్‌లను విడుదల చేయాలని పెద్దశంకరంపేట మండల బీజేపీ అధ్యక్షులు కోణం విఠల్ పేర్కొన్నారు. గురువారం పెద్దశంకరంపేట పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మెదక్ జిల్లాను రాజన్న సిరిసిల్ల జోన్‌లో కలపడం వల్ల విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జోన్‌లో కొనసాగుతున్న మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని డిమాండ్ చేశారు. నూతనంగా ఏర్పాటు అయిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలుపుతూ ఉద్యోగ నోటిఫికేషన్‌లు విడుదల చేయాలన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులను ఇబ్బంది పెట్టే విధంగా తీసుకొచ్చిన 317 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు శ్రావణ్ కుమార్, మంగలి కృష్ణ, బుగుడాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం కోసం తపాలా ఉద్యోగుల సమ్మె



సమ్మె చేస్తున్న తపాలా ఉద్యోగులు

**వెల్దుర్తి, డిసెంబర్15 ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన వెల్దుర్తిలో గురువారం అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు దేశ వ్యాప్త సమ్మె జరుగుతుందని, ఈ సమ్మెలో భాగంగా శుక్రవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని పోస్టాఫీస్ ముందు తపాలా ఉద్యోగులు సమ్మె నిర్వమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నియమించిన కమలేష్ చంద్ర నివేదిక సమర్పించి ఏండ్లు గడుస్తున్నా దానిని అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం మొండి వైఖరికి నిరసనగా సమ్మె చేస్తున్నట్లు వారు తెలిపారు. కమలేష్ చంద్ర కమిటీ సిఫారసులైె సీనియారిటీ, ఇంక్రిమెంట్, ఎక్స్‌గ్రేషియా, మెడికల్, పెన్షన్ తదితర సౌకర్యాలు వెంటనే అమలు చేయాలన్నారు. టార్గెట్‌ల కోసం వేధించడం ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా సెక్రటరీ ఆంజనేయులు, వైస్ సెక్రటరీ మహమ్మద్ మజర్, ట్రెజరర్ రఘురాములు, అశోక్, ఆంజనేయులు, వెంకటేష్, శ్రీశైలం పాల్గొన్నారు.

### మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**మర్కుక్, డిసెంబర్ 15 (ప్రభాతవార్త):** మర్కుక్ మండలం పాములపర్తి గ్రామానికి చెందిన నీల ఎల్లవ్వ అనారోగ్యంతో మృతిచెందగా విషయం తెలుసుకున్న మండల బిఆర్ఎస్ పార్టీ బిసిసెల్ అధ్యక్షుడు, ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మేకల కనకయ్య ముదిరాజ్ శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ మండలంలోని నిరుపేద కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని పేర్కొన్నారు. ఆయన వెంట స్థానికులు నీల నర్సింలు, కిష్టయ్య, కనకయ్య, మహేష్ ఉన్నారు.

# కల్తీకల్లు విక్రయాలపై చర్యలు తీసుకోవాలి : ఎంపిపి సాయిలు

**మిరుదొడ్డి, డిసెంబర్ 15, ప్రభాతవార్త :**
కల్తీకల్లు విక్రయాలపై ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపిపి గజ్జల సాయిలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విచ్చలవిడిగా కల్తీకల్లు విక్రయాలు జరుగుతున్నాయని దీనిపై చర్యలు తీసుకోవాలని అల్వాల సర్పంచ్ కిష్టయ్య, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు తుమ్మల బాలరాజులు సభ దృష్టికి తీసుకురాగా దీనిపై ఎంపిపి సాయిలు స్పందించారు. వెంటనే కల్తీకల్లు విక్రయాలను నిలిపివేయాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. సమావేశానికి ఎక్సైజ్ సీఐ లేదా ఎస్ఐ రాకుండా కానిస్టేబుల్‌ను పంపించడంతో ప్రజాప్రతినిధులు అగ్రహం వ్యక్తం చేశారు. మరో సారి కానిస్టేబుల్ కాకుండా సీఐ లేదా ఎస్ఐ సమావేశానికి హాజరు కావాలన్నారు. అల్వాలలో చేపట్టిన ఫీడర్ ఛానల్ పనులు అసంపూర్తిగా నిలిచిపోగా రైతులకు ఇబ్బందికరంగా మారిందని ఈ పనులు పూర్తి చేయించాలని వైస్ ఎంపిపి పోలీసు రాజులు సభ దృష్టికి తేచ్చారు. దీంతో వెంటనే ఎంపిపి స్పందిస్తూ సంబంధిత అధికారులు పనులు వెంటనే పూర్తి చేయాలని అదేశించారు. అనంతరం నూతనంగా మిరుదొడ్డి పిఏసిఎస్ చైర్మన్‌గా ఎన్నికైనా రాజలింగారెడ్డిని




పిఏసిఎస్ చైర్మన్‌గా ఎన్నికైన రాజలింగారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారుల సుకూరి లక్ష్మీ, రాజిరెడ్డి, గోవర్ధన్, జోగు ప్రభుదాస్, సుతారి నరసింహులు, కాలేరు శ్రీనివాస్, చెప్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లోని పెండింగ్ పనులను పూర్తి చేయాలి : ఎంపిపి పాండుగౌడ్




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి పాండుగౌడ్

**మర్కుక్, డిసెంబర్ 15 (ప్రభాతవార్త):**
మండల పరిధిలోని పలు గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఎంపిపి పాండుగౌడ్ సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం మండలకేంద్రం మర్కుక్ ఎస్సీ ఫంక్షన్‌హాల్‌లో ఎంపిపి పాండుగౌడ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు సభలో వారి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎంపిపి పాండుగౌడ్, జెడ్‌పిటిసి మంగమ్మ రాంచంద్రం, వైస్ ఎంపిపి బాల్‌రెడ్డిలు మాట్లాడుతూ సర్వసభ్య సమావేశంలో చర్చించిన సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. కాగా సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపిడిఓ ప్రవీణ్, ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్, ఎంపిటిసిలు నరేందర్, ధనలక్ష్మి, లక్ష్మినర్సమ్మ, కో-ఆప్షన్ సభ్యులు సాహెర నరేష్, సర్పంచ్‌లు భాస్కర్, అశోక్, నర్సింలు, ప్రవీణ్, గాయత్రి, భాగ్య, సూపరింటెండెంట్ ప్రభాకర్, ఏఓ నాగేందర్‌రెడ్డి, ఎంఈఓ ఉదయభాస్కర్‌రెడ్డి, మిషన్ భగీరథ ఏఈ తిరుమల్‌రెడ్డి, ఎంపీఓ లింగం, ఈసీ రాజు, ఏపీఎం కిరణ్, ఆర్టీసీ సిబ్బంది స్వాతి, ఫారెస్ట్ అధికారి జ్యోతి, పిఆర్ ఏఈ పాషా, సిబ్బంది నర్సింలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జిల్లాలో విక్‌సిత్ భారత్ సంకల్ప్ యాత్రను విజయవంతం చేయాలి

**-కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ డైరెక్టర్ పొసుమి బసు**

**మెదక్ అర్బన్, డిసెంబర్ 15 ప్రభాతవార్త:**
కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న వివిధ పథ కాలు, అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ డైరెక్టర్ పొసుమి బసు అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివధ పథకాలు గ్రాస్ రూట్ లెవెల్ చేరుకోవాలన్నదే వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రధాన ఉద్దేశం అన్నారు. శుక్రవా రం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులతో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రపై పొసుమిబసు జిల్లా కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ పథకాలకు సంబంధించి గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు ఎవరైనా అర్హులు ఉన్నట్లయితే వారు నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రచార రథాలను ఈ నెల 16న సాయంత్రం భారత ప్రధాని నరేంద్ర మోడీ వర్చు వల్‌గా ప్రారంభిస్తారని తెలిపారు. ఈ నెల 16 నుండి వచ్చే నెల 25 వరకు ప్రతి రోజు ఒక్కో వాహనం రెండు గ్రామ పంచాయతీలకు వెళ్తుంద న్నారు. ప్రజలకు ఈ క్యాంపులకు హాజరయ్యేలా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వ 17 పథకాల గురించి అవగాహన కల్పించాలని, ఆయా పథకాలలో ఏ విధంగా లబ్ధి పొందుతున్నారు. ఏ విధమైన లాభం జరుగుతున్నది లబ్ధిదారుల వ్యక్తిగత అనుభవాలను అందరితో పంచుకునేలా చూడాలన్నారు. సంకల్ప్ యాత్ర విజయవంతానికి అందరూ సహకరించా లని కోరారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లా డుతూ వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్య క్రమంలో భాగంగా జిల్లా 10 మొబైల్ వ్యాన్స్ వచ్చాయని, షెడ్యూల్ మేరకు




సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ డైరెక్టర్ పొసుమి బసు

ప్రతి వాహనం ప్రతి రోజు రెండు గ్రామ పంచాయితీలను కవర్ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామస్థాయిలో ఒకరోజు ముందు టామ్ టామ్ చేసి ప్రజలకు తెలియజేయాలని, అదేవిధంగా ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీనివాస్, ఎల్‌డీఎం మూర్తి, డీఎంహెచ్‌వో చందునాయక్, డీఈవో గోవింద్, డీఈవో రాధాకిషన్, డీపీవో సాయిబాబా, జెడ్పీ సీఈవో శైలేషన, ఉద్యాన శఖ డీడీ నర్సయ్య, డీడబ్ల్యూవో బ్రహ్మాజీ, పీడీ మెప్మా ఇందిరా, డీఎం సివిల్ సప్లై హరికృష్ణ, డీఎఫ్‌వో రవిప్రసాద్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# రౌడీ షీటర్లు సత్ ప్రవర్తన కల్గి ఉండాలి

**-రౌడీ మేళాలో జిల్లా ఎస్పి రూపేష్ చెన్నూరి**



రౌడీ మేళాలో రౌడీ షీటర్లకు సూచనలు చేస్తున్న జిల్లా ఎస్పి రూపేష్ చెన్నూరి

**సంగారెడ్డి టౌన్, డిసెంబరు 15, ప్రభాతవార్త:**
చట్టలకు లోబడి ఉన్న వారితోనే పోలీసులు ఫ్రెండ్లీగా ఉంటారని, చట్టాలను చేతుల్లోకి తీసుకున్న వారితో కటువుగా వ్యవహరించడం తప్పదని జిల్లా ఎస్పి సిహెచ్ రూపేష్ చెన్నూరి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని పోలీసు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన రౌడీ మేళాకు ఎస్పి ప్రత్యేక అహ్వానితులుగా హాజరై రౌడీ షిటర్లను ఉద్దేశించి ప్రసంగించారు. రౌడీ షీటర్లకు సత్ ప్రవర్తనపై కౌన్సిలింగ్ నిర్వహించారు. పుట్టుకతో ఎవరూ నేరస్తులు కారని, వారు పెరిగిన పరిసరాలు అవసరాలు, పరిస్థితుల ప్రభావాలతో సస్పెక్ట్, కేడిలు, రౌడీ షీటర్లుగా మారి ఉంటారన్నారు. రౌడీ షీటర్ల ప్రవర్ధన మంచిగా ఉంటే మామూలు వ్యక్తులుగా మాప అవకాశం ఉంటుందని గుర్తు చేశారు. చట్టాలకు అతీతంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని ఎస్పి హెచ్చరించారు. రౌడీ షీటర్లతో ఎస్పి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. సత్ప్రవర్తన కలిగితే హీస్టరీ షీట్‌ను తొలగించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ పి అశోక్, రమేష్ కుమార్, డిఎస్‌పిలు రఘు, సంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, పోలీసు అధికారులు శివలింగం తదితరులు పాల్గొన్నారు.

## నాల్గో రోజుకు చేరిన గ్రామీణ తపాల ఉద్యోగుల సమ్మె




నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామీణ తపాల ఉద్యోగులు

**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 15, ప్రభాతవార్త:**
గ్రామీణ తపాల ఉద్యోగుల దేశావ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగా జిల్లా కేంద్రంలోని హెడ్ పోస్టాఫీస్ అవరణలో గ్రామీణ తపాల ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారంతో నాల్గో రోజుకూ చేరుకుంది. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో అల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.జనార్ధన్‌రెడ్డి, రాష్ట్ర కోశాధికారి మంద అంజనేయులు, ఉపాధ్యక్షులు నాంపలి. యూనియన్ నాయకులు జి.శంకర్, ఎల్.తిరుపతిరెడ్డి, ఎన్సాన్‌పల్లి ఎల్లయ్య, బాబు, రమేష్, కనకయ్య, ఇమాంబాయి, భార్గవి, మీన, శ్రీలత, శానూర్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

### చట్టాలపై ప్రతిఒక్కరు అవగాహన కల్గి ఉండాలి

**పూడూరు, డిసెంబర్ 15, ప్రభాతవార్త :** చట్టాలపై ప్రతిఒక్కరు అవ గాహన కల్గి ఉండాలని న్యాయవాదులు నర్సింహ్మారావు, గౌస్‌పాషా, వేణుగోపాల్, నసీర్‌లు పేర్కొన్నారు. శుక్రవారం పూడూరు మండలం పరిధిలోని సోమన్‌గుర్తిలో మండల న్యాసేవాధికార సంస్థ పరిగి అద్వ ర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రా మ ప్రజలకు పలు చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

### రేపు బిజెపి నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం

**పూడూరు, డిసెంబర్ 15, ప్రభాతవార్త :** ఈ నెల 17వతేదీ ఆదివా రం భారతీయ జనతా పార్టీ పరిగి నియోజకవర్గ స్థాయి సమీక్షా సమా వేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, పరిగి ఇంచార్జీ మారుతీకిరణ్ బూనేటి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల అనంతరం మొదటిసారిగా నిర్వహించే ఈ సమావే శం ఉదయం 11గంటలకు పరిగిలోని తన నివాసంలో ప్రారంభమవు తుందని వివరించారు. ఇట్టి సమీక్షా సమావేశానికి పరిగి అసెంబ్లీ ని యోజకవర్గంలోని బిజెపి రాష్ట్ర, జిల్లా, మండల, బూత్‌స్థాయి కార్యక ర్తలతోపాటు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరై జయ ప్రదం చేయాలని ఆయన కోరారు.

### సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయండి

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 15, ప్రభాతవార్త:** ఈ నెల 23 వ తేదిన జరిగే సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సింగరేణి రిటైర్డు ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆళవందార్ వేణుమాధవ్ అన్నారు. ఘట్‌కేసర్ మండలం కొర్రెముల సుప్రభాత్ టౌన్‌షిప్‌లో శుక్రవారం సింగరేణి వెల్ఫేర్ అసోసియేషన్ జరిగింది. ఈ సంద ర్భంగా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ డిసెంబర్ 23 వ తేది నాటికి సింగరేణి సంస్థ ఆవిర్భావించి 134 సంవత్సరాలు అవు తుందని అన్నారు. సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరిం చుకుని నాగోల్‌లో ఉదయం పది గంటల నుండి వేడుకలు నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు రిటైర్డు కార్మికులతో పాటు సింగరేణి సంస్థ ఉద్యోగులు సైతం హాజరుకావాల్సిందిగా కోరా రు. ఈ సమావేశంలో కె. బీరయ్య, బంగారి రాజయ్య, సుద్దాల లక్ష్మినారాయణ, శ్రీనివాస్, అరుణ్‌కుమార్, చుక్కల నర్సయ్య, బి. మల్లయ్య, బాల్‌రెడ్డి, రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితాను సవరణ చేయాలి

**బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు గాదె మహిపాల్ ముదిరాజ్**

**కుల్కచర్ల డిసెంబర్15;ప్రభాతవార్త;**తప్పుల తడకగా ఉన్న ఓటర్ల జాబితాను సవరణ చేయాలని బిజెపి మండల శాఖ తరుపున అద్యక్షుడు గాదె మహిపాల్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటి తహసీల్దార్ రమేష్‌కు మెమోరాండమ్ సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్దిరోజుల్లోనే సర్పంచ్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వార్డుల వారీగా ఓటరు జాబితాను సిద్ధం చేయాలని ఆయన కోరారు. ఒక వార్డులో ఉన్న వ్యక్తి మరొక వార్డులో మరికొందరివి రెండు వార్డుల్లోనూ ఉన్న కారణంగా పోటీలో ఉండే అభ్యర్థులు గందరగోళానికి గురి అయ్యే అవకాశం ఉందని వాటిని సరి చేసి ఎవరి వార్డులో వారు ఓటు వేసే విధంగా సరిచేయాలని తెలి పారు. ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చా మండల అద్యక్షుడు గుడల వెంకటేష్, మండల ట్రెజరర్ కొండ అంజి, కిసాన్ మోర్చా నాయకుడు పాల్గొన్నారు.

### వినియోగదారులకు అవసరమైన సౌకర్యాలను అందిస్తుంది

శామిర్‌పేట డిసెంబరు15, ప్రభాతవార్త :ఉష్ణోగ్రతలు పడిపోవడం వలన, వెచ్చదనం మరియు సౌకర్యాలను ఎక్కువగా కోరుకుంటారు. అయితే ఫ్యాషన్ పోకడను నిర్వహించి మరియు ట్రెండ్‌కు అనుగుణంగా ఉండటం కూడా అంతే ప్రధానం, మీ శీతాకాలం ఫ్యాషన్ మరియు సౌందర్య అవసరాలు గురించి శ్రద్ధవహించడానికి అమేజాన్ ఫ్యాషన్ తమ వింటల్ స్టోర్ దుస్తులు, సౌందర్యం మరియు శీతాకాలానికి కావలసిన ఇతర వస్తువులకు చెందిన ప్రముఖ బ్రాండ్స్‌తో సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించింది.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన ఎంపిపి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ స్వరూప నరేందర్‌రెడ్డి, ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ

**వెల్దుర్తి, డిసెంబర్15 ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం పచ్చదనం, పరిశుభ్రతపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ స్వరూప నరేందర్‌రెడ్డి, ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ, వైద్యురాలు సౌజన్య, వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలను వైద్యురాలు సౌజన్య సమావేశంలో వివరించారు. అనంతరం స్థానిక ఎంపీపీ స్వరూప నరేందర్‌రెడ్డి, ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మలు మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రం ఆవరణ శుభ్రంగా ఉంచాలని సూచించారు. వివిధ గ్రామాల నుండి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, నాయకులు మల్లేశంతో పాటు ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

## శాసన సభ స్పీకర్‌ను సత్కరించిన యూత్ కాంగ్రెస్ నాయకులు



శాసనసభ స్పీకర్‌గా ఎన్నికైన గడ్డం ప్రసాద్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 15, ప్రభాతవార్త:**
రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా నూతనంగా ఎన్నికైన గడ్డం ప్రసాద్‌కుమార్‌ను రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనరెడ్డితో కలిసి హైదారాబాద్‌లోని అయన స్వగృహంలో శుక్రవారం కలిసి శాలువాతో ఘనంగా సత్కరించినట్లు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి పూజల గోపికృష్ణ తెలిపారు. ఎంపిటిసిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి స్పీకర్‌గా ఎన్నిక కావడం అందరికి స్పూర్తి దాయకమని గోపికృష్ణ తెలిపారు. గడ్డం ప్రసాద్ నాయకత్వంలో ప్రతి ఒక్కరికి మేలు జరిగి తీరుతుందన్నారు. అయన వెంట రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అధైర్యపడొద్దు..ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుంది



మాజీ మంత్రి హరీష్‌రావుకు కలిసిన మాజీ ఎమ్మెల్యే రసమయి, పార్టీ నాయకులు

**బెజ్జంకి, డిసెంబర్ 15, ప్రభాతవార్త :**
ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు మండల నాయకులకు సూచించారు. శుక్రవారం హైదారాబాద్‌లోని అయన స్వగృహంలో మానకొండూరు మాజీ ఎమ్మెల్యే బాలకిషన్ అధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు బోయినపల్లి శ్రీనివాస్‌రావు, గౌతమ్‌రావు, నాంపల్లి, శంకర్, మాశం బాబు, రేవోజు శ్రీనివాసచారి, బండి సురేష్‌లు మాజీ మంత్రి హరీష్‌రావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ ఎన్నికలు వస్తుంటాయి..పోతుంటాయి అధికారం ఉన్నా లేకున్న ఎల్లప్పుడూ ప్రజలకు అందబాటో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. అలాగే పార్టీని బలోపేతం చేస్తూ ప్రతి కార్యకర్త ముందుకు సాగాలన్నారు.

## ఘనంగా పంబ ఆరట్టు ఉత్సవం



స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

**హుస్నాబాద్, డిసెంబరు15, ప్రభాతవార్త**
హుస్నాబాద్‌లోని సిద్దేశ్వర గుట్టపై వెలసిన అయ్యప్ప స్వామి దేవాలయంలో శుక్రవారం పంబ ఆరట్టు ఉత్సవ వేడుక మూర్తులు, అయ్యప్ప స్వాములమధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాములు శరణు గోషల మధ్య ఎల్లమ్మ చెరుకు కట్టకు చేరుకుని స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమం ప్రధాన అర్చకులు పోలోజు భానుమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ ఆకుల వెంకన్న, గురు స్వాములు సురేందర్, రమణ, శివరాం, బుచ్చిరెడ్డి, నరేంవర్, సంపత్ , చంద్రయ్య, కమిటీ మాజీ చైర్మెనప్ అయిలేని శంకర్‌రెడ్డి, ఎండి అయూబ్, బొల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ఘనంగా కన్నె స్వామి పడిపూజ

**వెల్దుర్తి, డిసెంబర్15 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బస్వాపూర్ వద్ద గల శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయం వద్ద శుక్రవారం కన్నె స్వామి మహా పడిపూజను అయ్యప్ప స్వామి మాలాధారణ భక్తులు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులను చెల్లించుకున్నారు. అయ్యప్ప మాలాధారులు ఆటపాటలతో ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మహా పడిపూజ వెంకట్‌గౌడ్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.

## బిఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలు

**-మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**

**గజ్వేల్, డిసెంబర్ 15 (ప్రభాతవార్త):** బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా కార్యకర్తలకు అండగా ఉంటుందని మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు వంటేరు ప్రతాప్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దని, ప్రతిపక్షంలో ఉన్నా అధికారంలో ఉన్నా మీ వెంటే ఉంటామన్నారు. బిఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలు శ్రీరామరక్ష అని, ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. అనంతరం కార్యకర్తలకు మిఠాయిలు తినిపించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ ఎల్ల వెంకటేశం, బిఆర్ఎస్ నాయకులు అహ్మద్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



సాయిబాబాకు మిఠాయి తినిపిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి


ప్రిన్సిపాల్‌కు వినతిపత్రం అందచేస్తున్న ఎబివిపి విద్యార్థులు

## కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలి

**పుల్కల్, డిసెంబరు 15, ప్రభాతవార్త:** సుల్తాన్‌పూర్‌లోని జెఎన్‌టియు హెచ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహకు అఖిల భారత విద్యార్థి పరిషత్ సంగారెడ్డి జిల్లా బాధ్యుల ఆధ్వర్యంలో వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఎబివిపి రాష్ట్ర జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు అందించే భోజనం నాణ్యతగా ఉండటం లేదన్నారు. ఫలితంగా విద్యార్థులు అర్ధాకలితో అలమటిస్తున్నారని చెప్పారు. కళాశాలలో మౌలిక సదుపాయలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. కళాశాలకు 161 ఎకరాల భూమి ఉన్నా యూనివర్సిటీ గుర్తింపు కలిగినప్పటికి అక్కడ క్రీడాప్రాంగణం, సిట్టింగ్ గార్డెన్ లేకపోవడం విస్మయాన్ని కల్గిస్తోందన్నారు. సంబంధిత అధికారులతో చర్చించి విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్గించేలా చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపాల్‌కు సూచించామన్నారు. విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా కన్వీనర్ ఆకాష్, తనాజీ, నిఖిల్, వెంక్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాల్‌కల్‌లో నిరంతరం వెలుగుతున్న లైట్లు


నిరంతరం వెలుగుతున్న హైమాస్ లైట్లు

**న్యాల్‌కల్, డిసెంబరు 15, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం మూలంగా వీధి దీపాలు నిరంతరం (రౌండ్ ద క్లాక్) వెలుగుతూనే ఉన్నాయి. అవసరం లేని సమయాల్లో దీపాలను ఆర్పేసి విద్యుత్ ఆదా చేయాలని చెప్పే అధికారులు తమ నిర్లక్ష్యం, పట్టింపులేనితనం మూలంగా విద్యుత్ సరఫరా వృధాఅవుతున్నా పట్టించుకోకపోవడం విస్మయాన్ని వ్యక్తం చేస్తోంది. న్యాల్‌కల్‌లో ఏర్పాటు చేసిన హైమాస్ లైట్లు రాత్రి, పగలు, ఉదయం అని తేడా లేకుండా నిరంతరం విద్యుత్ వెలుగుతూనే ఉండటంతో విద్యుత్ వినియోగం వృధా అవుతోందని గ్రామస్థులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు, గ్రామ పంచాయతీ బాధ్యులు స్పందించి విద్యుత్ వినియోగం వృధా కాకుండా తగు చర్యలు తీసుకోవాలి గ్రామస్థులు సూచిస్తున్నారు.

## కేతకి ఆలయంలో పర్యావరణ శాఖ అధికారి పూజలు


పూజలు చేస్తున్న పర్యావరణ శాఖ అధికారి కృష్ణ ఆదిత్య శ్రీరామ్‌శెట్టి

**ఝరాసంగం, డిసెంబరు 15,ప్రభాతవార్త:** మండల కేంద్రంలో పార్వతీ దేవి సమేతంగా కొలవున్న శ్రీకేతకి సంగమేశ్వరస్వామి ఆలయాన్ని శుక్రవారం పర్యావరణ శాఖ కంట్రోల్ బోర్డు సభ్యులు కృష్ణ ఆదిత్య శ్రీరామ్ శెట్టి దర్శించుకున్నారు.ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా స్వామి వారికి కృష్ణ ఆదిత్య శ్రీరామ్‌శెట్టి అభిషేకం పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అధికారిని ఆశీర్వచనాలుచేసి తీర్ధ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో అర్చకులు బసయ్యస్వామి, నాగయ్యస్వామి, వీరసంగయ్య స్వామి, మల్లికార్జున స్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న మెడ్విన్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి

**సంగారెడ్డి మున్సిపాలిటి, డిసెంబరు 15, ప్రభాతవార్త:** సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి నిధుల నిర్మాణానికి శుక్రవారం భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఓసాట్ ఆధ్వర్యంలో మెడ్విన్ వినతి మేరకు ప్రమతి సాఫ్ట్‌వేర్ ప్రయివేట్ లిమిటెడ్ హైద్రాబాద్ వారి సహకారంలో మూడు తరగతి గదుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఎంఇఓ వెంకటనరసింహులు, మెడ్విన్ డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి, సభ్యులు హరీష్, ఆయూష్, సోమనాథ్, కన్సల్టెంట్ శాంతి ప్రియ, సర్పంచ్ మచ్చ విజయలక్ష్మి నరేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి ఉమారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్‌కు సన్మానం


గోషామహల్ ఎమ్మెల్యేను సన్మానిస్తున్న బిజెపి నాయకులు

**సంగారెడ్డి మున్సిపాలిటి, డిసెంబరు 15, ప్రభాతవార్త:** హైద్రాబాద్‌లోని గోషామహల్ శాసనసభ స్థానం నుంచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్‌ను శుక్రవారం బిజెపి నాయకులు ఘనంగా సన్మానించారు. హైద్రాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర నాయకులు కొండాపురం జగన్, బోసుపల్లి ప్రతాప్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్ శ్రీనివాస్‌లు మర్యాద పూర్వకంగా కలుసుకుని ఎమ్మెల్యే రాజాసింగ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు.

## రైతుబంధుకు దరఖాస్తుల స్వీకరణ

**నాగల్‌గిద్ద, డిసెంబరు 15,ప్రభాతవార్త:** రైతుబంధు పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ వెంకటేశం తెలిపారు. రైతుల నుంచి దర ఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు కల్గిన రైతులు క్లస్టర్‌పరిధిలోని ఏఈఓలకు దరఖాస్తులను పాసుపుస్తకం,ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతాపుస్తకాల జిరాక్సు పత్రాలను జతచేసి అందించాలన్నారు.

## రైతుబంధుకు దరఖాస్తు చేసుకోండి

**టేక్మాల్, డిసెంబరు 15, ప్రభాతవార్త:** మండల పరిధిలోని 942 మంది రైతులు రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆహ్వానం వ్యవసాయాధికారి రాంప్రసాద్ తెలిపారు. రైతుబంధుకు కొత్తగా 519మంది రైతుల, వానకాలం సీజన్‌కి 423 రైతులు దరఖాస్తు చేసుకోలేదన్నారు. మొత్తం 942 మంది రైతులు రైతుబంధుకు అర్హులన్నారు. రైతులు టేక్మాల్ మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో పట్టా పాస్‌బుక్, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్‌లను తీసుకెళ్లి నమోదు చేసుకోవాలన్నారు.

# అవినీతి ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్దమా?

**కక్ష సాధింపునకు పాల్పడుతున్న కాంగ్రెస్**

**జిల్లాలోనే కొత్తపల్లిని ఉత్తమపంచాయతీగా నిలబెట్టా**

**విలేకరులతో కొత్తపల్లి సర్పంచ్ కుమ్మరి జగన్నాథం**


మాట్లాడుతున్న సర్పంచ్ జగన్నాథం

**పాపన్నపేట, డిసెంబరు 15, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోవడంతో తమపై కాంగ్రెస్ నాయకులు కక్షసాధింపుకు పాల్పడుతున్నారని కొత్తపల్లి గ్రామ సర్పంచ్ కుమ్మరి జగన్నాథం మండిపడ్డారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమపై చేసిన ఆరోపణలపై బహిరంగ చర్చకుసిద్దమా అని సవాల్ విసిరారు. తాము 3.98 లక్షల అవినీతికి పాల్పడినట్లు ఉప సర్పంచ్ అంజలి సత్యనారాయణ ఆరోపించారని, అది ముమ్మాటికి అవాస్తమన్నారు. అప్పట్లో మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సహకారంతో కొత్తపల్లిని అభివృద్ధి చేసి జిల్లాలోనే ఉత్తమ పంచాయతీగా జిల్లా కలెక్టర్‌చే అవార్డును అందుకున్నట్లు గుర్తు చేశారు. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధిని మెచ్చుకుని మంత్రి హరీష్‌రావు రూ. 5 లక్షలు, అప్పటి జిల్లా కలెక్టర్ 3 లక్షల రూపాయలను మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పంచాయతీలో 3.98 లక్షల రూపాయలు గోల్ మాల్ అన్నది పచ్చి అబద్ధమన్నారు. 3.98 లక్షల నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కాంపౌండ్ వాల్ తదితర పనుల చెల్లింపుల కోసం యంబి 538 ద్వారా జరిగిందని, తొలగించిన ఉప సర్పంచ్‌ను తిరిగి ఆధికారులు బాధ్యతలు అప్పగించారని, పంచాయతీ కార్యదర్శి పలుమార్లు ఉప సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వాపోయారు.

**రూ. 2 కోట్ల 50లక్షలతో అభివృద్ధి చేశా...**

గ్రామాన్ని 2 కోట్ల 50 లక్షల రూపాలయతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టినట్ల సర్పంచ్ జగన్నాథం పేర్కొన్నారు.గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులకుగాను జిల్లా కలెక్టర్ ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపిక చేసి అవార్డును అందచేసినట్లు గుర్తు చేశారు. గ్రామంలో చేసిన పనులకు గాను తనకే 25 నుంచి 30 లక్షల రూపాయల వరకు బిల్లులు రావాల్సి ఉందని సర్పంచ్ పేర్కొన్నారు.


పెద్దమ్మతల్లి కళ్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి

## దైవచింతన కలిగి ఉండాలి : మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి

**చిన్నశంకరంపేట, డిసెంబర్ 15, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేట మండలం చందంపేటలోని పెద్దమ్మతల్లి దేవాలయ పంచమ వార్షికోత్సవాల్లో భాగంగా అమ్మవారి కళ్యాణం నిర్వహించగా ఆమె పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజు, సర్పంచి శ్రీలత, నాయకులు లక్ష్మారెడ్డి, కుమార్‌గౌడ్, ఎంపీటీసీ శివ కుమార్, సర్పంచి లక్ష్మణ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

**కార్యకర్తలకు అండగా పార్టీ ఉంటుంది....**

**చిన్నశంకరంపేట, డిసెంబర్ 15, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉన్న ప్రతి కార్యకర్తకు బీమా సౌకర్యం కల్పించిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. ఇటీవల చిన్నశంకరంపేటకు చెందిన పార్టీ కార్యకర్త నర్సింలు అనారోగ్య సమస్యతో బాధపడుతూ మృతి చెందాడు. శుక్రవారం మృతుడి భార్య శోభకు పార్టీ బీమా రూ.2 లక్షల చెక్కును ఆమె అందించారు. బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని, అధికారం లేకపోయిన వారి బాగోగులను పట్టించుకోవాల్సిన బాధ్యత నాపై ఉందన్నారు. భవిష్యత్తులో అన్ని విధాలుగా పార్టీ ఆదుకుంటానని, వారికి భరోసానిచ్చారు. పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు రాజు, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, నాయకులు లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ కుమార్‌గౌడ్, బండారు స్వామి, ఎంపీటీసీ యాదగిరి, చంద్రం, శ్రీనివాస్‌రెడ్డి,లక్ష్మణ్ పాల్గొన్నారు.

## 18న మండల సర్వసభ్య సమావేశం

**న్యాల్‌కల్, డిసెంబరు 15, ప్రభాతవార్త:** ఈ నెల 18వ తేదీన ఎంపిపి అధ్యక్షురాలు అంజమ్మ అధ్యక్షతన మండల సాధారాణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి మండల సభ్యులు, సర్పంచ్‌లు, జడ్పీటిసి సభ్యులు సకాలంలో హాజరు కావాలని సూచించారు. ఆయా శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తి నివేదికలతో సభకు విధిగా సకాలంలో హాజరుకావాలని ఎంపిడిఓ వెంకట్‌రెడ్డి సూచించారు.

## గీతంను సందర్శించిన శ్రీఆద్య విద్యార్థులు

**పటాన్‌చెరు, డిసెంబర్ 15,ప్రభాతవార్త:** హైదరబాద్, మాతృశ్రీ నగర్‌లోని శ్రీ ఆద్య జూనియర్ కళాశాలకు చెందిన 160 మంది 12వ తరగతి ఎంపీసీ విద్యార్థులు, వారి అధ్యాపకులతో కలిసి శుక్రవారం గీతం హైదరాబాద్ ప్రాంగణాన్ని సందర్శించారు. గీతం నిర్వహిస్తున్న పలు కోర్సుల వివరాలతో పాటు అందులో నెలకొని ఉన్న మౌళిక సదుపాయాలు, అత్యాధునిక ల్యాబరేటరీలు, తరగతి గదులు, ప్రపంచ శ్రేణి గ్రంథాలయం, హాస్టళ్లు వంటి వాటిని విద్యార్థులు స్వయంగా పరిశీలించి ఓ అవగాహనను ఏర్పరచు కున్నారు. శ్రీ ఆదర్వ విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యశాల, అనుభవపూర్వక అభ్యాసాలను గీతం కోర్ ఇంజనీరింగ్ అధ్యాపకులు నిర్వహించారు. తమ అభిరుచికి తగ్గ ఉన్నత విద్యా కోర్సులను ఎంపిక చేసుకోవడానికి ఈ మార్గ దర్శనం వారికి ఎంతో ఉపకరించింది. కేవలం విద్యకే పరిమితం కాకుండా సహ,అదనపు పాఠ్యాంశాల ద్వారా సంపూర్ణ పరిణితి సాధించడం ఎలాగో వారు గ్రహించారు. నాణ్యమైన విద్య,పరిశోధన, కార్యనిర్వాహక శిక్షణలో పేరొందిన గీతం తమ ప్రాంగణాన్ని సందర్శించిన విద్యార్థులకు మరువురాని అనుభూతిని మిగిల్చింది. సామాజిక భాధ్యతలో భాగంగా, ఇంటర్మీడియేట్ విద్యార్థులు, వారి వారి అధ్యాపకులు కార్యశాలలు, అధ్యాపక వికాస కార్యక్రమాలను గీతం డిమ్డ్ విశ్వవిద్యాలయం నిర్వహిస్తుంది. వివిధ అంశాలపై వారి నైపుణ్యాలను, పరిజ్ఞానాన్ని మెరుగుపర్చడానికి ఉపకరించేలా విటిని రూపొందించారు.

## నేడు నల్లవెల్లిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**యాచారం డిసెంబరు 15,ప్రభాతవార్త :**

యాచారం మండల పరిధి లోని నల్లవెల్లి గ్రామంలో 11కెవి ఫిడర్ విద్యుత్ మరమ్మతుల కా రణంగా అంతరాయం కలగనుందని ఏఈ సందీప్ కుమార్ ప్రకట నలో తెలిపారు.రైతులు,గృహ అవసర వినియోగదారులు,చిరు వ్యాపారులు అంతరాయానికి అనుగుణంగా పనులు నిర్వర్తించు కొని సహకరించగలరని కోరారు.ఉదయం 9 గంటల నుంచి సా యంత్ర 6 గంటల వరకు విద్యుత్ నిలిపివేయబడుతుందని తెలిపారు.


మాట్లాడుతున్న ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్

## ఓటరు జాబితాపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలి : ఆర్డీవో

**చిన్నశంకరంపేట, డిసెంబర్ 15,ప్రభాతవార్త:** ఓటరు జాబితా విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులకు ఆర్డీవో అంబదాసు రాజేశ్వర్ సూచించారు. శుక్రవారం చిన్నశంకరంపేటలో తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు, అంగన్‌వాడీ టీచర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాను పరిశీలించి డూప్లికేట్ ఓటర్లను లొలగించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఒకే వ్యక్తికి రెండు ఓటర్లు ఉన్నవాటిని చాలా వరకు లొలగించామని, మిగిలిపోయిన వాటిని పరిశీలించి తొలగించాలన్నారు. ఓటరు కార్డులో తప్పులు ఉంటే సరిచేసుకోవాలని, సందేహాలుంటే మండల, గ్రామస్థాయి అధికారులను సంప్రదించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఇది చివరి అవకాశమన్నారు. సమయం తక్కువగా ఉన్నందున ప్రతి ఒక్క అధికారి విధులను సక్రమంగా నిర్వహించాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దార్ మహేందర్‌గౌడ్, వివిధ గ్రామాల అంగన్‌వాడీ టిచర్లు పాల్గొన్నారు.

## పుస్తెలు, మెట్టెలు అందజేత

**నర్సాపూర్, నర్సాపూర్ రూరల్, డిసెంబర్ 15,ప్రభాతవార్త:** మండల పరిధి మూసాపేట్ గ్రామానికి చెందిన మన్నే లక్ష్మీనారాయణ కూతురు శిరీష వివాహానికి బిజెపి రాష్ట్ర నాయకులు వాల్దాస్ మల్లేష్‌గౌడ్ పుస్తెలు, మెట్టెలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శి నగేష్‌గౌడ్, శ్రీకాంత్‌చారి, మూసాపేట్ బూత్ అధ్యక్షుడు శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని బలోపేతం చేద్దాం

**జిల్లా ఇన్‌చార్జి మల్లిగారి యాదగిరి**

**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 15, ప్రభాతవార్త:** ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని నిర్మాణాత్మకంగా బలోపేతం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా ఇన్‌చార్జి మల్లిగారి యాదగిరి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల జిల్లా స్థాయి సమావేశం ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ముంద్రాతి కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కోసం మాదిగ జాతి చేస్తున్న ఉద్యమం ప్రస్తుతం చాలా కీలక దశకు చేరిందన్నారు. 30 ఏళ్లుగా మాదిగ, ఉప కులాల హక్కుల కోస ం పోరాడుతూనే సమాజంలోని అన్నివర్గాల పక్షాన నిలబడి పాలకులతో పోరాడుతూ సమాజానికి సంక్షేమ ఫలాలు అందించిన చరిత్ర ఎమ్మార్పీఎస్‌కు ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో జాతి భవిష్యత్ కోసం మాదిగ, మాదిగ ఉపకులాలు ఏకమై ఉద్యమంవైపు నడుంకట్టాలన్నారు. ఈనెల 17 నుంచి జిల్లాలోని ప్రతి మండలంలో మండల కమిటీలు ఏర్పాటుచేయాలన్నారు. వర్గీకరణ సాధించే వరకు పోరాటం చేద్దామని..వర్గీకరణ సాధిస్తేనే మాదిగ, మాదిగ ఉప కులాల కుటుంబాలలో వెలుగులు నిండుతాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్, ఎంఎస్‌పి నాయకులు జెరిపోతుల లత, చెబర్తి యాదగిరి, ముక్కపల్లి రాజు, సామ్రాట్ ప్రకాష్, పర్శరాములు, కొలిమి మల్లేష్, సుంచు రమేష్, పవన్,కళ్యాణ్, అంజి, రమేష్, మహేష్, భాస్కర్, ప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జి యాదగిరి


వనదుర్గా మాతను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సునిత లక్ష్మారెడ్డి

## వనదుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

**పాపన్నపేట, డిసెంబరు 15, ప్రభాతవార్త:**ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయాన్ని శుక్రవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలను ఆలయ కమిటీ చైర్మన్ సాతెల్లి బాలగౌడ్, ఇఓ మోహన్ రెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకగా అర్చకులు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల ముగిసిన శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధిస్తే 101 కొబ్బరి కాయలు సమర్పిస్తామని మొక్కుకున్నట్లు, అమ్మవారి ఆశీర్వచనాలతో శాసనసభ తలుపులు తట్టినందుకు శుక్రవారం మొక్కుబడులు చెల్లించుకునేందుకు ఆలయానికి వచ్చినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలను కమిటి చైర్మన్, ఇఓలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు మనోహర్, మోహన్‌రావు, సిబ్బంది సూర్య శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## చెరుకు రైతులను ఆదుకుంటాం

**జహీరాబాద్, డిసెంబరు 15, ప్రభాతవార్త:** జహీరాబాద్ ప్రాంతంలోని చెరుకు రైతులను ఆదుకుంటామని కర్ణాటకలోని మన్నెల్లిలోని బీకె ఎస్కే చక్కర కర్మాగారం చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ నసిముద్దీన్ పటేల్ భరోసా కల్పించారు. శుక్రవారం మొగుడంపల్లి పరిధిలోని చెరుకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాడ్గి కాంగ్రెస్ నాయకులు జమ హర్షద్ పటేల్‌తో కలిసి చర్చించారు. ఈసందర్భంగా నసిముద్దీన్ పటేల్ మాట్లాడుతూ జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్ మండలాలతోపాటు ఇరత మండలాల్లోని చెరుకును తమ కర్మాగారానికి తోలేందుకు పడుతున్న ఇబ్బందులను పరిష్కరిస్తానన్నారు. జహీరాబాద్ ప్రాంతంలోని చెరుకును తమ కర్మాగారానికి తరలించేందుకు రైతులకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సమావేశంలో మాడ్గి ఉప సర్పంచ్ మైపాల్ యాదవ్, నాయకులు అజ్మహల్ పటేల్, గఫార్ తదితరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న నసిముద్దీన్ పటేల్

## రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి

**మరొకరికి తీవ్రగాయాలు**

**జోగిపేట, డిసెంబర్ 15, ప్రభాతవార్త:** మండల పరిధిలోని తాలెల్మ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక ఉపాధ్యాయుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఉపాధ్యాయుడికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం... జోగిపేటకు చెందిన పిట్ల రాజ్‌కుమార్, సందీప్ కుమార్ మండల పరిధిలోని తాలెల్మ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. రోజులాగే పాఠశాలలో విధులు నిర్వహించేందుకు ద్విచక్రవాహనంపై జోగిపేట నుంచి తాలెల్మకు బయలుదేరారు. కాగా, తాలెల్మ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న ఆర్టీసి బస్సు ఢీకొట్టడంతో ఉపాధ్యాయుడు రాజ్‌కుమార్(40) అక్కడికక్కడే మృతిచెందగా మరో ఉపాధ్యాయుడు సందీప్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సందీప్‌ను హుటాహుటిన సంగారెడ్డి ఆసుపత్రికి తరలించి అక్కడినుంచి హైదరాబాదుకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించి మృతుడి భార్య పిట్ల అనురాధ ఫిర్యాదు మేరకు ఆర్టీసి బస్సు డ్రైవర్ హైమద్‌అలీపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు జోగిపేట ఎస్ఐ అరున్‌కుమార్ తెలిపారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పిట్ల రాజ్‌కుమార్ కుటుంబాన్ని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి పరామర్శించారు.

## ఆసుపత్రిలో ఉన్న చెల్లెను చూడటానికి వచ్చి అన్న మృతి

**మెదక్ అర్బన్, డిసెంబర్ 15 ప్రభాతవార్త:** ఆసుపత్రిలో ఉన్న చెల్లెను చూడటానికి వచ్చి ప్రమాదవశాత్తు ఆసుపత్రిలో కాలుజారి పడి మృతి చెందిన సంఘటన మెదక్ పట్టణంలోని మెదక్ ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం రోడ్డు ప్రమాదంలో గాయపడిన రేణుక మెదక్ పట్టణంలోని మెదక్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న అన్న నర్సింలు (42) చెల్లెలు రేణుకను పరామర్శించడానికి మెదక్ ఏరియా ఆసుపత్రికి వచ్చాడు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన నర్సింలు కాలుజారి క్రింద పడటంతో తలకు తీవ్ర గాయమై మరణించాడు. మృతుడి భార్య భాగ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మెదక్ పట్టణ ఎస్ఐ పోచయ్య తెలిపారు. మృతుడికి భార్య భాగ్యతో పాటు ముగ్గురు కూతుర్లు ఉన్నారు.

## గర్భంలో ఇన్‌ఫెక్షన్ సోకి ఆవు మృతి

**నాగల్‌గిద్ద, డిసెంబరు 15, ప్రభాతవార్త:** గర్భంలో ఇన్‌ఫెక్షన్ సోకి ఆవు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని శిఖర్ఖానలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు వడ్డే శివరాజ్ 1 లక్ష రూపాయల విలువ చేసే ఆవును సాకుతూ కుటుంబాన్నిపోషించకుంటున్నాడు. ఆవు గర్భం దాల్చడంతో ఇన్‌ఫెక్షన్ సోకి మృతిచెందిందని రైతు శివరాజ్ చెప్పారు. పశు వైద్యాధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదని బాధితులు వాపోయారు. బాధితుడికి ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్థులు వినతి చేస్తున్నారు.

## గొడవలొద్దన్న వ్యక్తిపై హత్యాయత్నం

**-పోలీసుల అదుపులో నిందితుడు**

**జహీరాబాద్, డిసెంబరు 15, ప్రభాతవార్త:** కట్టుకున్న భార్యతో గొడవ పడుతున్న వ్యక్తిని గొడవలొద్దని వారించిన వ్యక్తిపై భర్త పదునైన కత్తితో దాడి చేసి గాయపర్చిన సంఘటన గురువారం రాత్రికి పట్టణంలో జరిగింది. సిఐ బి రాజు కథనం ప్రకారం... మహారాష్ట్రలోని ఔరంగబాద్‌కు చెందిన భార్య భర్తలు బోస్లే బబ్లిబాయి, సూర్‌కాస్, కుమారుడు సార్తిక్ షిండే, కోడలు రియో, పిల్లలు పట్టణ శివారులోని ఫ్లైఓవర్ బ్రిడ్జి(బాగారెడ్డి చౌరస్తా) వద్ద ప్లాస్టిక్ కాగితాలతో గుడిసెలు వేసుకుని బిక్షాటన చేస్తూ కాలాన్ని వెళ్లదీస్తున్నారు. గురువారం రాత్రి 7.30 గంటల ప్రాంతంలో బాగారెడ్డిపల్లిలో ప్రవీణ్ రాజ్‌పుత్(30) కల్లు తాగి భార్య సంగీతతో గొడవ పడుతుండగా సార్తిక్ షిండే గొడవలు వద్దని భర్తకు సర్ది చెబుతుండగా తాగిన మైకంలో ఉన్న ప్రవీణ్ రాజ్‌పుత్ కత్తితో మా సంసార విషయంలో నీవెందుకుగా కల్గచేసుకుంటావు అంటూ పదునైన కత్తితో సార్తిక్ షిండేపై దాడి చేయడంతో సార్తిక్ షిండేకు బలమైన గాయాలుకాగా, తల్లి బోస్లే బబ్లిబాయికి స్వల్పగాయాలకు గురయిందన్నారు. బస్తే బబ్లిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సార్తిక్ షిండేను చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. నిందితుడు ప్రవీన్‌రాజ్ పుత్‌ను అరెస్టు చేసి, పదునైన కత్తిని స్వాదీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సిఐ రాజు వివరించారు.



పోలీసుల అదుపులో వ్యక్తిని గాయపర్చిన నిందితుడు

# ఎల్లుపేటలో పిహెచ్‌సి భవన నిర్మాణానికి స్థల సేకరణ

**అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన మంత్రి దామోద్ రాజనర్సింహా**

**టేక్మాల్, డిసెంబరు 15, ప్రభాతవార్త:** రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అందోల్ నియోజకవర్గంలో విద్య,వైద్యం పై ప్రత్యేక దృష్టి సారించిన విషయం తెల్సిందే. అందులో భాగంగా జరిగిన ఎన్నికల్లో నియోజవర్గ పరిధిలోని టేక్మాల్ మండలంలో బొడగట్టు,సూరంపల్లి, కమ్మరికత్త, వెల్పుగొండ, ఎల్లుపేట, శాబాద్ తండా గ్రామ పంచాయతీల్లోనఆయన ప్రచారం చేశారు. ఎక్కువగా గిరిజన తండాలున్నాయి. వీరికి వైద్యం అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా పట్టించుకున్న పాపన పోలేదని ఆ ప్రాంతా వాసుల ఆవేదనను అర్థం చేసుకుని మంత్రి దామోదర్ మారుమూల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న ఉద్దేశంతో ఎల్లుపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లోనగెలుపొంది రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఎల్లుపేట గ్రామ శివారులో ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ అధికారులు స్థల సేకరణ చేయాలని మంత్రి ఆదేశాలు జారిచేశారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు టేక్మాల్ తహసీల్దార్ క్రిష్ణ, ఆర్ఐ శ్రీకాంత్ ఎల్లుపేట గ్రామ శివారులోగల సర్వే నంబర్ 21లో 5 ఎకరాల భూమిని స్థల సేకరణచేశారు. ఆసుపత్రి నిర్మాణానికి అనుకులంగా ఉందని చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ రమేష్, నాయకులు, మాన్‌కిషన్, మల్లారెడ్డి, సత్యనారాయణ, సుధాకర్, మజర్,సంగమేశ్వర్ మాట్లాడుతూ అభివృద్ధికి మార్క్ రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అని కోనియాడారు. అనుకున్నదే తడువు చేసేది తరువాయి అన్నట్లుగా అభివృద్ధి పనులను మొదలు పెట్టారన్నారు. పేదల సంక్షేమమే ముఖ్యమని విద్య వైద్యాన్ని అందించాలన్నలక్ష్యంతో ముందుకు సాగుతున్నారని అన్నారు.ముందుగా మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా హార్థిక శుభాంకాక్షలు తెలియజేశారు. మండల అభివృద్ధికి శ్రీకారం చుట్టిన మంత్రి వర్యులకు ధన్యవాదాలు తెలిపారు. మీ పరిపాలనలో ఆందోల్ నియోజక వర్గం మరింత అభివృద్ధి చెందడం తథ్యమన్నారు.


రెవెన్యూ అధికారులతో గ్రామస్తులు స్థల సేకరణ చేస్తున్న దృశ్యం

